క్లుప్తంగా

నీలం మధుకు సీపీఎం మద్దతు

సంగారెడ్డి టౌన్: మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపునకు సీపీఎం, సీపీఐ కృషి చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు తెలిపారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు టీఎస్ఐడీసీ చైర్మన్ నిర్మలా రెడ్డి సంగారెడ్డి సీపీఎం జిల్లా కార్యాలయం కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా నాయకులను కలిసి మెదక్ పార్లమెంటులో తన గెలుపు కోసం ఇండియా బ్లాక్ భాగస్వామ్య పక్షానికి మద్దతు ఇవ్వాలని నీలం మధు కోరారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్, సాయిలు, కార్యదర్శి వర్గ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు నర్సింహులు, ఆఫీస్ కార్యదర్శి కృష్ణ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ జూలకంటి ఆంజనేయులు, కౌన్సిలర్ నాగరాజు, రుద్రారం మాజీ సర్పంచ్ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వలస కార్మికుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: వలస కార్మికుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం ఆర్కేనగర్ కాలనీకి చెందిన కమ్మరిసింగ్ అనే వ్యక్తి దగ్గర రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి గ్రానైట్ టైల్స్ పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీన పని ఉందని కమ్మరిసింగ్ ద్విచక్రవాహనాన్ని ప్రకాష్ తీసుకొని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కమ్మరిసింగ్ పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

కంగ్టి(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న డబుల్‌కాట్‌తో పాటు పరుపులు, వ్యవసాయ మోటారు విద్యుత్ తీగలు, తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని దామర్‌గిద్దా గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డార్కు కిషన్‌రావు ఇంట్లో తాళం వేసి ఉన్న ఓ గదిలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కుటుంబీకులు లోపలి ఇంట్లో ఉండడంతో ప్రమాదాన్ని తొందరగా గుర్తించలేదు. నల్లటి పొగల కమ్మివేయడంతో చూసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు కిషన్‌రావు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబీకులు కోరారు.

వివాహిత అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఒంగోలు జిల్లాకు చెందిన దావీద్ అనే వ్యక్తి పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గ్రామానికి వచ్చి కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన భాను అనే మహిళను వివాహం చేసుకున్నాడు. అయితే వీరి మధ్య కొంతకాలంగా చిన్నచిన్న గొడవలు ఈ క్రమంలో ఈ నెల 20న డబ్బులు ఇవ్వడంలేదని భార్య గొడవ చేయగా దావీద్ 28వ తేదీన రూ.20 వేలు భర్త ఇచ్చాడు. మరునాడు తనకు అనారోగ్యంగా ఉందని ఆస్పత్రిలో చూపించుకుంటానని భాను ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో భార్య కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మేడేను జయప్రదం చేయండి

హత్నూర (సంగారెడ్డి): భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే 138వ మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు తెలిపాలని విజ్ఞప్తి చేశారు. మే 1న ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించనున్న కార్యక్రమానికి కార్మికులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి 15 లీటర్ల మద్యం బాటిళ్లను స్వా. దీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీలో సుశీల బెల్ట్‌షాప్ నిర్వహిస్తోందని సమాచారం రావడంతో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 9 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అదేవిధంగా సాయికాలనీలో మహేష్ అనే వ్యక్తి బెల్ట్‌షాప్‌పై దాడులు నిర్వహించి ఆరున్నర లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది ఫలితాల్లో ప్రభంజనం

- సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- అభినందనలు తెలిపిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో సెంట్ అంథోని స్కూల్ విద్యాసంస్థల అధినేత

నారాయణఖేడ్: టెన్త్ ఫలితాల్లో నారాయణఖేడ్, నిజాంపేట్ మండలాల్లో 10 పాఠశాల్లో 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఖేడ్ మండలంలోని 15 ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో కలిపి 911మంది విద్యార్థులు పరీక్ష రాయగా 891మంది ఉత్తీర్ణత సాధించారు. సంజీవన్‌రావు పేట్, అబ్బెంద, ర్యాకల్, ఖేడ్ మైనార్టీ గురుకులం, ఎస్టీ గురుకులం, అనంతసాగర్, ర్యాలమడుగు, నిజాంపేట్ మండలంలోని బాచేపల్లి, నాగ్‌ధర్, నిజాంపేట్ పాఠశాలల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఆయా పాఠశాలల్లో ఐదుగురు 10 జీపీఏ సాధించారు.

పటాన్‌చెరు టౌన్: పది ఫలితాల్లో పటాన్‌చెరు, అమీన్‌పూర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పటాన్‌చెరు మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో 732 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 681 ఉత్తీర్ణత సాధించారు. అమీన్‌పూర్ మండలం పరిధిలో 4 ప్రభుత్వ పాఠశాలల్లో 194 మంది పరీక్ష రాయగా 192 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని అనూష 10/10, ముత్తంగి ప్రభుత్వ పాఠశాలకు చెందిన నిశాంత్ 9.7, ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన మరో విద్యార్థి 9.2 శాతం మార్కులు సాధించారని ఎంఈఓ పీపీ రాథోడ్ తెలిపారు.

100శాతం సాధించిన 5 పాఠశాలలు

న్యాల్‌కల్(జహీరాబాద్): పది ఫలితాల్లో హద్నూర్, మామిడ్గి, చాల్కి, చీకూర్తి, మెటల్‌కుంట పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. మిర్జాపూర్(బి) 98శాతం, న్యాల్‌కల్ జడ్పీహెచ్ఎస్, కేజీబీవీలు 97 శాతం ఉత్తీర్ణత సాధించగా రేజింతల్ 89 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 389 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 381మంది ఉత్తీర్ణత సాధించారు. మెటల్‌కుంటకు చెందిన ఆఫియాబేగం, న్యాల్‌కల్ పాఠశాలకు చెందిన సద్దాం 9.8 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు.

411 మంది ఉత్తీర్ణత

మునిపల్లి(అందోల్): పదో తరగతిలో 412 మంది విద్యార్థులకు గాను 411 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మునిపల్లి మోడల్ స్కూల్, లింగంపల్లి గురుకుల పాఠశాల, ఖమ్మంపల్లి, కంకోల్ పాఠశాలలో 10/10 శాతం మార్కులు సాధించారు. కంకోల్ ఉర్దూ మీడియం పాఠశాలలో ఒక విద్యార్థి ఫేల్ కాగా 99.75 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మిగతా పాఠశాలలో 100/100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కంగ్టి మండలంలో...

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని 5ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 332 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 326 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కంగ్టి జెడ్పీహెచ్ఎస్‌లో 88 మంది విద్యార్థులు, ఎస్టీ రెసిడెన్షియల్‌లో 67 మంది, తడ్కల్ జెడ్పీహెచ్ఎస్‌లో ఆరుగురు పరీక్షలు రాయగా 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా బాలికల విద్యాలయంలో 44 మందికి గాను 43 మందితో 97.73శాతం, తడ్కల్ జెడ్పీహెచ్ఎస్‌లో 127 మందికి 122 మందితో 96.06 శాతం పాస్ అయ్యారు. అత్యధికంగా రెసిడెన్షియల్‌ల్లో ఆరుగురు విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): పదో తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 97.38 శాతం ఉత్తీర్ణత సాధించి విజయ ఢంకా మోగించారు. మండల వ్యాప్తంగా 459 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 447మంది ఉత్తీర్ణత సాధించారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఎల్గోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 12 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.

ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. తెలంగాణ ప్రభుత్వ మోడల్ పాఠశాల, తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల, కస్తూర్బా పాఠశాల, కొల్లూర్, ఈదులనాగులపల్లి, వెలిమెల జిల్లా పరిషత్ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. బీహెచ్ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాల 96శాతం, రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాల 95శాతం ఉత్తీర్ణత సాధించింది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన వైష్ణవి, తేజస్విని, మానస 9.8 జీపీఏలు సాధించారు.

ఏడు పాఠశాలల్లో 100శాతం

కోహీర్(జహీరాబాద్): మండలంలోని 12 పాఠశాలల్లోని ఏడు పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. 10 మంది విద్యార్థులు 10 జీపీఏతో సత్తా చాటారు. మండలంలో 591 మంది పరీక్షలు రాయగా 98.30 శాతంతో 581 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గురుజువాడ, దిగ్వాల్, కవేలి, గొడిగార్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థినులు, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థినులు, (దిగ్వాల్ ప్రైవేట్) జీఎంఆర్ పాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిచరణ్, తులసి, జీఎంఆర్ పాఠశాల విద్యార్థిని నందిని, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థిని సైదనిషత్ ఫాతిమా, తెలంగాణ గురుకుల పాఠశాల విద్యార్థినులు మీనాక్షి, ప్రవంతి, మహాత్మా జ్యోతిరావుపూలే విద్యార్థినులు అంజలి, పవిత్ర, భాగ్యలక్ష్మి, అంజలి 10 జీపీఏ సాధించారు.

ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు సత్తా చాటారు. వావిలాల, మంగంపేట, కొడకంచి, గిరిజన గురుకుల పాఠశాల, మాదారం కస్తూర్బాగాంధీ విద్యాలయం, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు వందశాతం ఫలితాలను సాధించారు. తెలంగాణ మెడల్ స్కూల్‌కు చెందిన షర్మిల, మానస 10 జీపీఏ సాధించారు. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, దోమడుగు, అనంతారం, అన్నారం, గుమ్మడిదల, కానుకుంట, నల్లవల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణతను సాధించాయి.

9 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలో తొమ్మిది ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల పరిధిలో 14 ఉన్నత పాఠశాలలు ఉండగా 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. సింగూరు గురుకుల పాఠశాలకు చెందిన రాహుల్, శివ్వంపేట ఉన్నత పాఠశాలకు చెందిన ఇందు 10 జీపీఏ సాధించారు.

గురుకులాల్లో 100శాతం ఉత్తీర్ణత

జహీరాబాద్: పది ఫలితాల్లో జహీరాబాద్‌కు చెందిన గురుకుల పాఠశాలల పలువురు విద్యార్థినులు 10 జీపీఏ సాధించారు. రంజోల్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఝాన్సీ 10 జీపీఏ సాధించింది. హోతి(కె) గురుకుల పాఠశాలకు చెందిన ప్రవంతి, మీనాక్షి10 జీపీఏ సాధించారు. ఎంఆర్‌హెచ్ఎస్, హుగ్గెల్లి, బూచనెల్లి, అల్గోల్, సత్వార్, బూచనెల్లిలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. మొగుడంపల్లి మండలంలోని మొగుడంపల్లి, జాడీమల్కాపూర్, ధనాసిరి, గిరిజన బాలికల గురుకుల పాఠశాలలు సైతం 100 శాతం ఉత్తీర్ణతను సాధించారు. అదేవిధంగా జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. పల్లవి, దీపిక, మైథిలి, మహేందర్, అర్చన, చందనశ్రీ, సత్య, సరయు, భువనచందన, మానిక, అలిన తహ్రీం, డి.శ్రీకాంత్‌లు 10 జీపీఏ సాధించారు. వెంకటేశ్వర పాఠశాల 100శాతం ఉత్తీర్ణత సాధించింది.

చేర్యాల విద్యార్థుల ప్రతిభ

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని చేర్యాల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఐదుగురు విద్యార్థులు 9.8 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మండలంలో 468 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 467మంది ఉత్తీర్ణులయ్యారు. నౌశీన్‌బేగం, కీర్తన, కావ్యాంజలి, శృతి, మమత 9.8 జీపీఏ సాధించారు.

96శాతం ఉత్తీర్ణత

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 96శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని 18 పాఠశాలల్లో 09 పాఠశాలలు కొనాపూర్, ఆత్మకూర్, పెద్దాపూర్, వెల్టూర్, వెంకటాపూర్, కొల్కూర్, ఆరూర్, కేజీబీవీ, బీసీ గురుకుల 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. సదాశివపేట బీసీ గురుకుల పాఠశాలకు చెందిన మేఘన, మహేశ్వరి, సాహితి ముగ్గురు బాలికలు 10 జీపీఏ సాధించారు.


అనూష (10/10)

ఆఫియాబేగం(9.8)

సద్దాం(9.8)

మహేశ్వరి 10/10)

అంజలి (10/10)

రామశ్రీజా (10/10)

మానస (9.8)

వైష్ణవి (9.8)

తేజస్విని (9.8)

షర్మిల (10/10)

మానస (10/10)

ఝాన్సీ (10/10)

ప్రవంతి (10/10)

మీనాక్షి (10/10)

మేఘన (10/10)

మహేశ్వరి (10/10)

సాహితి (10/10)


విద్యార్థినులతో వెలిమెల ప్రభుత్వ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు


సంబురాలు జరుపుకుంటున్న దిగ్వాల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

సెంట్ అంథోని స్కూల్ విద్యార్థులకు సన్మానం

సంగారెడ్డి: పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని సెంట్ అంథోని పాఠశాల ప్రభంజనం సృష్టించింది. 22 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా సెయింట్ అంథోనీస్ విద్యాసంస్థల అధినేత సోలోమోన్‌రెడ్డి సత్తాచాటిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ జయబాలరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపిద్దాం

- కాంగ్రెస్, బీజేపీలు దొందు దొందే
- మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిలిచి గెలిపిద్దామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు పటాన్‌చెరు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో నిర్వహించనున్న సందర్భంగా ఇంద్రేశం, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల, ఐనోలు, రామేశ్వరంబండ, బచ్చుగూడెం, పోచారం గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తూ ప్రజల ముందుకు వెళ్తున్నామన్నారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెజార్టీతో గెలిపించాలి

జిన్నారం(పటాన్‌చెరు): మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం, బొల్లారం పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్‌లో బీఆర్ఎస్ జెండా ను ఎగురవేసేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన తెల్లాపూర్ మున్సిపల్ మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లల్లో మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మోసపూరిత హామీలకు చిరునామా కాంగ్రెస్ అని ఆరోపించారు. మే 8వ తేదీన పటాన్‌చెరులో నిర్వహించే కేసీఆర్ రోడ్డు షోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్‌లు బాలాజీ, నాగరాజు, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం, విష్ణు, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఉమేశ్, నరసింహులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహానికి ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు మధు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని కోటక్ మహేంద్ర బ్యాంక్ సమీపంలో అనారోగ్యంతో పడి ఉన్న యాచకుడిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సుమారు 36 రోజులు నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. మృతుడి బంధువుల కోసం పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేయగా మృతుడికి సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, సభ్యులతో కలిసి మృతదేహానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

సౌకర్యాల పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు సౌకర్యాలను కల్పించేందుకు ఎంపీడీఓ సత్తయ్య మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ మేరకు మండల పరిధిలోని భీంరా, నాగుర్(కే) గ్రామాల శివారుల్లో పనులను పరిశీలించారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలు చెబుతున్న మాటలను విని మోసపోవద్దని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్, సజ్జారావుపేట తండా, బంగార్‌బౌలి తండా, మిర్జంపల్లి తండా, విఠునాయక్ తండా, పడియాల్‌తండా, చున్నంబట్టితండాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అసెంబ్లీ ఇన్‌చార్జి దేవిప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు, గుండప్ప, విజయ్‌కుమార్, సంజీవరెడ్డి, నారాయణ, సురేష్, ఓంకార్ పాల్గొన్నారు.

ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


అనంతసాగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరాంరెడ్డికి మద్దతుగా అనంతసాగర్, సైదాపూర్, అలియాబాద్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించారని మండిపడ్డారు. వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, నాయకులు పాండురంగం, మల్లేశం, ఇంద్రారెడ్డి,నగేష్, అమీనోద్దీన్, రామాగౌడ్, ఫహీం, మల్లాగౌడ్, రుక్మోద్దీన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


ప్రచారం నిర్వహిస్తున్న దేవేందర్‌రెడ్డి, నాయకులు

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిరిపుర, తెల్లరాళ్ల తండా, గోవిందరాజ్‌పల్లి, తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి మద్దతుగా స్థానిక నాయకులతో కలిసి దేవేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అమలుకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని ఉద్ధరించింది ఏమీలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, నాయకులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, రవి, శ్రీకాంత్, నరేందర్, వీరేశంగౌడ్, వీరేందర్ యాదగిరి తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌తోనే హామీల అమలు సాధ్యం

కంగ్టి(నారాయణఖేడ్): ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని పార్లమెంట్ ఎన్నికల నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి శశికళరెడ్డి పేర్కొన్నారు. కంగ్టి మండలం రాజారాంతండా, చుక్కల్‌తీర్థ్, రాంతీర్థ్, గాజుల్‌పాడ్, హోబా తండాల్లో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరఫున ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్ పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ నేతల ఇంటింటి ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ కార్మికుల సమావేశాన్ని జయప్రదం చేయండి

పటాన్‌చెరు టౌన్: మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా బుధవారం రామచంద్రాపురం పట్టణ పరిధిలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కార్మిక సంఘాలు, కార్మికులతో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం పలు పరిశ్రమల్లో కార్మిక సంఘాలను కలిసి ఆహ్వానపత్రాలను అందజేశారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో హంగర్గా(కె) మాజీ సర్పంచ్ నాగొశెట్టి, బీఆర్ఎస్ నాయకులు సంగమేశ్వర్, బస్వరాజ్ తమ అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్ పటేల్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

◆ బీజేపీ శ్రేణుల ప్రచారం

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని చిక్‌మద్దూర్, లింగాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనుల వద్ద బీజేపీ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓట్లు వేసి గెలిపించాలని కూలీలను కోరారు. నాయకులు శ్రీశైలం, ప్రవీణ్‌గౌడ్, గౌరయ్య పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్ పాలనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీం అన్నారు. హత్నూర మండలంలోని రెడ్డి ఖానాపూర్, కాసాల, బోరుపట్ల, నాగుల్దేవులపల్లి, మంగాపూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం గుప్తా, మణిదీప్, అజీజ్, పోచయ్య, కిష్టయ్య ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ ఎన్నికల ప్రచారం ప్రారంభం



నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన స్వగృహం ఎదుట ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కౌన్సిలర్లు వివేకానంద్, సంధ్యారాణిరామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్‌అలీ, ముఖ్య నాయకులు ముంతాజ్, గౌస్‌చిస్తి పాల్గొన్నారు.